# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 7-8-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 5 | పేజీలు:4 | వెల: రూ.1/-


## ఇకపై మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఆగష్టు 6:కేంద్ర లోని బీజేపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్రీడల్లో అత్యున్నత పురస్కారం అయిన రాజీవ్ ఖేలరత్న అవార్డు పేరును మారుస్తు కీలక నిర్ణయం తీసుకుంది. ఇక పై మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్నగా పేరును మారుస్తున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ అవార్డు పేరును మార్చాలని తనకు దేశవ్యాప్తంగా పౌరుల నుంచి అనేక వినతులు అందాయని ఈ సందర్భంగా మోదీ ట్విటర్‌లో వెల్లడించారు. వాళ్ల సెంటిమెంట్‌ను దృష్టిలో ఉంచుకొని ఇక నుంచి ఖేల్‌రత్న అవార్డు పేరును మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుగా మారుస్తున్నట్లు ప్రకటించారు. హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతి అయిన ఆగస్ట్ 29ని ఇప్పటికే జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ధ్యాన్ చంద్ ఇండియాకు ఒలింపిక్స్ లో పతకాలు తీసుకువచ్చిన తరువాతనే ఖేల్ రత్న అవార్డు ఇవ్వడం ప్రారంభమైంది దీంతో? ఇప్పుడు ఇన్నాళ్లకు ప్రతిష్టాత్మకమైన అవార్డు పేరుకు ముందు ధ్యాన్ చంద్ పేరును జోడించారు.

## పన్ను చట్టాల సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం.. స్వాగతించిన ఆర్బీఐ

న్యూఢిల్లీ, ఆగష్టు 6:పన్ను చట్టాల సవరణ బిల్లుకు ఇవాళ లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీంతో రెట్రో ట్యాక్స్‌కు బ్రేక్ వేస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇంధన, ఎనర్జీ సంస్థలతో పన్ను వివాదాలు నెలకొన్న నేపథ్యంలో.. పన్ను చట్టాల సవరణ బిల్లును నిన్న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. రెట్రో ట్యాక్స్ విధానం వల్ల భారత ప్రభుత్వానికి మిలియన్ల డాలర్ల రూపంలో నష్టం వస్తున్నది. అంతేకాదు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను కూడా ఆ ట్యాక్స్ విధానం పెట్టబడుల లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది.

మేం ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా రెట్రో ట్యాక్స్ విధానాన్ని వ్యతిరేకించామని కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ బిల్లు చర్చ సమయంలో తెలిపారు. హై లెవల్ కమిటీ ద్వారా ఈ సమస్యను పరిష్కరిస్తామని గతంలో మాజీ మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారని ఆమె సభకు వెల్లడించారు. రెట్రో విధానంలో కొత్త కేసులు ఏమీ లేవని, కెయిర్న్ ఎనర్జీ.. వోడాఫోన్ కేసుల్లో తుది ఒప్పందం కోసం ప్రయత్నిస్తున్నామని మంత్రి తెలిపారు. రెట్రోస్పెక్టివ్ పన్ను విధానాన్ని బీజేపీ నమ్మదన్నారు.

రెట్రో ట్యాక్స్ రద్దు అంశం చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సరైన సమయంలో నిర్ణయం తీసుకుందన్నారు. కొత్త పన్ను చట్టాల సవరణ బిల్లు ఆహ్వానించదగ్గ చర్య అని శక్తికాంత్ దాస్ తెలిపారు.

## రూ. 1280 కోట్లతో 17 ఎస్టీపీలు : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ , ఆగష్టు 6: నగరంలోని ఫతేనగర్‌లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. రూ. 317 కోట్లతో 100 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగు నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతో పాటు రూ. 1280 కోట్లతో 17 ఎస్టీపీలు నిర్మించబోతున్నామని స్పష్టం చేశారు. 17 ఎస్టీపీ కేంద్రాల్లో 376.5 ఎంఎల్‌డీల మురుగునీరు శుద్ధి చేస్తామని కేటీఆర్ ప్రకటించారు.

1,950 ఎంఎల్‌డీల మురికి ఉత్పత్తి

ఫతేనగర్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. హైదరాబాద్‌కు పరిశ్రమలు, పెట్టుబడులు తరలివస్తున్నాయి. ఉపాధి కల్పన పెద్ద ఎత్తున జరుగుతుంది. ప్రతి ఏడాది లక్షల మంది హైదరాబాద్‌కు వస్తున్నారు. దీంతో కొత్త కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇండ్లు నగరానికి నలు వైపులా పెరుగుతున్నాయి. ప్రతి రోజు హైదరాబాద్‌లో 1,950 ఎంఎల్‌డీల మురికిని ఉత్పత్తి చేస్తున్నారు. అందులో దాదాపు 90 నుంచి 94 శాతం మురికి నీరు గ్రావిటీ ద్వారా మూసీ నదిలోకి వెళుంది. అలా మురికి నీరు మూసీ నుంచి కృష్ణా నది, ఆ తర్వాత సముద్రంలో కలుస్తోంది. ఆ మురికి నీరును ట్రీట్‌మెంట్ చేసేందుకు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటున్నాం. గతంలో భోలక్‌పూర్‌లో మంచి నీరు, మురికి నీరు లైన్లు కలిసిపోయి 9 మంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితిని చూశాం అని కేటీఆర్ గుర్తు చేశారు.

మురికినీటిని శుద్ధి చేయడం అత్యంత ప్రాధాన్యం కలిగిన పని అని కేటీఆర్ పేర్కొన్నారు. భారతదేశంలో 8 మహానగరాలు ఉన్నాయి. వీటన్నింటిలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో దాదాపు 40 శాతం(772 ఎంఎల్‌డీల) మురికి నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేస్తున్నాం. కానీ ఇది సరిపోదు. ఇంకా 1200 ఎంఎల్‌డీల దాకా మురికి నీరు మిగిలి ఉంది. ఈ నీటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేయకపోతే.. మనం అనుకున్నట్లు విశ్వనగరంగా రూపొందించుకోలేం. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి సర్కిల్స్‌లో రూ.1,280 కోట్లతో 17 ఎస్టీపీలు కట్టబోతున్నాం. వీటి స్థాపిత సామర్థ్యం 376.5 ఎంఎల్‌డీలు. దాదాపుగా 55 నుంచి 60 శాతానికి ట్రీట్‌మెంట్‌కు పోతాం. మరో 40 శాతం మిగిలి ఉంటుంది. ఆ 40 శాతాన్ని పూర్తి చేసేందుకు మరిన్ని ఎస్టీపీలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఎస్టీపీలు నిర్మించే ఏరియాలు

కూకట్‌పల్లి సర్కిల్‌లోని ప్రగతి నగర్‌లో ఉండే అంబీర్ చెరువు మీద ఒకటి, చిన్న మైసమ్మ చెరువు వద్ద, నల్ల చెరువు, ఖాజాకుంట, ఎల్లమ్మకుంట చెరువు, ఫతేనగర్‌లోని నాలా మీద ఎస్టీపీలు నిర్మిస్తామన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో వెన్నలగడ్డ, చింతల్ డివిజన్‌లోని గాయత్రీనగర్ వద్ద, ఫాక్స్ సాగర్ చెరువు వద్ద, శివాలయ నగర్ చెరువు వద్ద, పరికి చెరువు వద్ద ఎస్టీపీలు ఏర్పాటు చేస్తామన్నారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో మియాపూర్‌లోని పటేల్ చెరువు వద్ద, గంగారం చెరువు వద్ద, ముల్లకత్తువా చెరువు వద్ద, కాముని చెరువు వద్ద, దుర్గం చెరువు వద్ద, ఖాజాగూడ చెరువు వద్ద ఎస్టీపీలను నిర్మిస్తామన్నారు.

## గొల్ల, కురుమల గురించి ఆలోచించిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్

సిద్దిపేట,ఆగష్టు 6: రాష్ట్రంలో గొల్ల, కురుమల క్షేమం గురించి ఆలోచించిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలోని మల్లిఖార్జున స్వామి ఫంక్షన్ హాల్‌లో పశు వైద్య, పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు ఉచితంగా మందుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులవృత్తులకు చేయూతను అందించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు, పాలకులు ఎవ్వరూ గొల్ల, కురుమల అభివృద్ధి గురించి పట్టించుకోలేరన్నారు. ప్రభుత్వం రూ. 5 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన మొదటి విడత గొర్రెల పంపిణీ మంచి ఫలితం ఇచ్చిందన్నారు. 2వ విడత పంపిణీ కోసం సర్కారు రూ.6 వేల కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.

పక్కాగా గొర్రెల పంపిణీ..

పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని గొర్రెల యూనిట్ ధరను రూ.1.25 లక్షల నుంచి 1.75 లక్షలకు సీఎం పెంచారని చెప్పారు. గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా పశు వైద్యాధికారులకు సూచించారు. పంపిణీ చేసే గొర్రెలకు కొనుగోలు చేసిన ప్రాంతంలోనే బీమా పత్రాలను అందజేసేలా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గొర్రెలు చనిపోతే సకాలంలో బాధితులకు బీమా అందేలా చూడాలని ఆదేశించారు. పెరిగిన జీవాలకు అనుగుణంగా గ్రాసం కొరత రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. రైతులకు సబ్సిడీ పై గడ్డి విత్తనాలను సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. జీవాల వద్దకే వైద్యసేవలు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రారంభించిన సంచార పశు వైద్యశాలలు బాగా పనిచేస్తున్నాయన్నారు.

త్వరలో అందుబాటులోకి గొర్రెల మార్కెట్లు..

గొర్రెల పెంపకందారులు గొర్రెలను అమ్ముకునేందుకు, కొనుగోలు చేసేందుకు అన్నిరకాల సౌకర్యాలు, వసతులతో కూడిన మార్కెట్ల నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఖమ్మం, పెద్దపల్లి, వనపర్తి తదితర జిల్లాలలో గొర్రెల మార్కెట్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రతి జిల్లా కేంద్రంలో గొర్రెల మార్కెట్ నిర్మాణానికి అవసరమైన 5 ఎకరాల భూమిని ఆయా జిల్లా కలెక్టర్ల సహకారంతో గుర్తించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్థలం సమకూరిస్తే గజ్వేల్‌లో గొర్రెల మార్కెట్ నిర్మాణం చేపడతామని తెలిపారు. మేత కోసం అడవుల్లో గొర్రెలను తిప్పవచ్చన్నారు. ఇదివరకే ప్రభుత్వం ఈ విషయంలో జీవో జారీ చేసిందన్నారు.

ఈ సమావేశంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి. వెంకట్రామిరెడ్డి, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి అనిత రాజేంద్ర, గడా ప్రత్యేక అధికారి ముత్యం రెడ్డి, ఆర్డీఓ విజయేంద్ర రెడ్డి, జిల్లా పశు సంవర్ధక అధికారి సత్య ప్రసాద్, ఎంపీపీ లలిత, జెడ్పీటీసీ బాలమల్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణే శ్వాసగా బతికిన మహనీయుడు జయశంకర్ సార్ : ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డి


హైదరాబాద్ , ఆగష్టు 6: తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం తుదిశ్వాస వరకు అలుపెరుగకుండా శ్రమించిన మహనీయుడు ఆచార్య జయశంకర్ సార్ అని శాసనమండలి ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అన్నారు. జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం తన ఛాంబర్‌లో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి దశలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి తుదిశ్వాస వరకు ఉద్యమించిన మహానుభావుడు జయశంకర్ సార్ అని కొనియాడారు.రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సీఎం కేసీఆర్ జయశంకర్ ఆశయాలను సాకారం చేస్తున్నారని, అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ బొడకుంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రుల నివాస సముదాయంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. తెలంగాణకు జయశంకర్ సార్ చేసిన సేవల్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ 'కురుమద్దాలి' వ 'లక్ష్మీ'
నరసింహారావు ప్రజల నవ్వించుటకై
తెరపైన 'సుత్తివేలు'గ
తరతరములు మదినిలచె అనదగు కైతన !!

( ఆగష్టు 7 'సుత్తివేలు' కురుమద్దాలి లక్ష్మీనరసింహారావు జయంతి)



–రాధశ్రీ

సెల్: 9494481210

## రైతులతో కలిసి ప్రతిపక్ష నేతల ఆందోళన

న్యూఢిల్లీ, ఆగష్టు 6: పెగాసస్ స్పై వేర్, వివాదాస్పద వ్యవసాయ చట్టాలు, ద్రవ్యోల్బణం అంశాలపై పార్లమెంటులో చర్చించాలన్న విపక్షాల ( రాజూజూనీబతిబితినీని శ్రీవజీటవతీబ ) డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతూ వస్తున్నది. దాంతో వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి పార్లమెంట్ ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఇవాళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అధ్యక్షతన విపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి.

కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, అంబికాసోనీ, గౌరవ్ గొగోయ్, శివసేన ఎంపీ సంజయ్ రౌత్, ఆర్జేడీ నేత మనోజ్ ఝా, డీఎంకే నేత టీ శివ తదితరులు పార్లమెంటు ఆవరణలో సమావేశమై.. కేంద్రంతో ఉమ్మడి పోరాటం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వివిధ అంశాలపై కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేవరకు ఉమ్మడి పోరాటం ఆపకూడదని డిసైడయ్యారు. అనంతరం విపక్ష నేతలంతా బస్సులో జంతర్‌మంతర్‌కు వెళ్లారు.

అక్కడ వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతులతో విపక్ష పార్టీల నేతలు కలిసిపోయారు. రైతులకు మద్దతుగా వారు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా, పెగాసస్‌కు వ్యతిరేకంగా విపక్ష నేతలు నినాదాలు చేశారు.

## ఇరాన్ దేశాధ్యక్షుడిని కలిసిన విదేశాంగ మంత్రి

టెహ్రాన్, ఆగష్టు 6:: ఇరాన్ దేశాధ్యక్షుడు ఇబ్రహీమ్ రైసిని ఇవాళ కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కలివారు. ఇటీవల ఇరాన్ దేశాధ్యక్షుడిగా రైసి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన్ను తొలిసారి కలిసినట్లు మంత్రి జైశంకర్ తెలిపారు. తన ట్విట్టర్ అకౌంట్‌లో ఫోటోను పోస్టు చేశారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు ఇరాన్ ఆసక్తిగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. ప్రాంతీయ ప్రయోజనాల దృష్ట్యా ఇద్దరి మధ్య బంధం కీలకమైందన్నారు. ఇరాన్ టీమ్‌తో కలిసి పనిచేసేందుకు సుముఖంగా ఉన్నట్లు మంత్రి జైశంకర్ వెల్లడించారు. దేశాధ్యక్షుడిగా ఎన్నికైన రైసి.. నిన్న ప్రమాణ స్వీకారం చేశారు. ఆ కార్యక్రమానికి మంత్రి జైశంకర్ హాజరయ్యారు. ఇవాళ ఆ ఇద్దరూ ప్రత్యేకంగా భేటీ అయినట్లు తెలుస్తోంది.

## పోలీస్ శాఖలో మళ్లీ కరోనా..హోం గార్డ్ మృతి

హైదరాబాద్ , ఆగష్టు 6:హైదరాబాద్ లో పోలీస్ శాఖలో కరోనా మళ్లీ కలకలం రేపుతోంది. రెండు డోసుల వ్యాక్సిన్ వేయించుకున్నా పలువురు పోలీసు సిబ్బందికి కరోనా సోకుతుంది?ఇటీవల హైదరాబాద్‌లో పదుల సంఖ్యలో పోలీసులు కరోనాబారినపడ్డారు. తాజాగా ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సుధాకర్ రెడ్డి కరోనాతో గాందఈలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సుధాకర్ కి కరోనా వ్యాక్సిన్ డోస్ పూర్తి అయిన కోవిడ్ తో మృతి చెందారు. వరుస ఉత్సవాలు, బందోబస్తులు , నిరసనలు, ఆందోళనలతో పోలీసు శాఖను కరోనా మహమ్మారి వణికిస్తోంది? ఇప్పటికే పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు కూడా వ్యాక్సిన్ వేశారు.. అయితే, ఆందోళనలు ముట్టడి కార్యక్రమాలు ఉంటుండడంతో పోలీసులకు కరోనా టెన్షన్ వెంటాడుతోంది? గత నాలుగు రోజుల నుండి రాష్ట్రంలో మళ్లీ కరోనా కేసులు పెరుగుతూ వస్తున్నాయి.. ఇదే సమయంలో పోలీసు శాఖలోనూ కేసులు కలకలం సృష్టిస్తున్నాయి.

పండుగలైనా.. నిరసన, ఆందోళన కార్యక్రమాలు.. ఇలా ఏవైనా పోలీసులే ముందు ఉండాల్సిన పరిస్థితి.. ఈ మధ్య వరుసగా ఉత్సవాలు జరిగాయి? బక్రీద్, బోనాలు, ఘట్టాల ఊరేగింపు ఇలా బందోబస్తులో బిజీగా గడిపారు పోలీసులు.. మరోవైపు.. ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, ఆందోళనలను అడ్డుకోవడంలోనూ వారే ముందు ఉండాల్సిన పరిస్థితి.. దీంతో.. మళ్లీ కరోనా మహమ్మారి క్రమంగా పోలీసుశాఖలో వ్యాపిస్తోంది. మరోవైపు.. ప్రతిపక్షాలు వరుసగా ఆందోళనకు సిద్ధం అవుతుండడం కూడా.. పోలీసు శాఖను మరింత టెన్షన్ పెడుతోంది.

## తెలంగాణలో జోనల్, మల్టీ జోనల్ కేటగిరిల విభజన..

హైదరాబాద్ , ఆగష్టు 6:తెలంగాణలో జిల్లా, జోనల్, మల్టీ జోనల్ కేటగిరిల విభజిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు క్యాడర్ విభజన చేసింది ప్రభుత్వం ఏ పోస్ట్ ఏ కేటగిరి కిందకు వస్తుందో క్యాడర్ ని విభజిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.. మిగతా పోస్టులు జోనల్, మల్టీ జోనల్ పోస్టులు పేర్కొంటూ.. 84 జీవోను జారీ చేసింది ప్రభుత్వం.. కొన్ని లోకల్ క్యాడర్ పోస్టులు, జోనల్ పోస్ట్ లుగా మార్పు చేశారు.. స్టేట్ క్యాడర్ పోస్టులు మల్టీజోనల్ పోస్టులుగా మార్చారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆయా శాఖల్లో క్యాడర్ స్ట్రెంత్ నిర్ణయం? క్యాడర్ స్ట్రెంత్ ఆధారంగా ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల కేటాయింపు? కొత్త పోస్టుల మంజూరు ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. ఆ తర్వాత ఖాళీలపై స్పష్టత రానుంది.. మొత్తం 87 విభాగాధిపతులకు సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోస్టుల కేడర్ వర్గీకరణను ఖరారు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆగష్టు 16 నుండి రైతుల ఖాతాలో 'రుణ మాఫీ'



హైదరాబాద్ , ఆగష్టు 6: రాష్ట్రంలో ఆగష్టు 16వ తేదీ నుండి రైతుల ఖాతాలో రుణమాఫీ నగదు మొత్తం జమకానుంది. రూ.50 వేల వరకు రైతు రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నగరంలోని బీఆర్‌కేఆర్ భవన్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. 42 బ్యాంకుల అధికారులు భేటీకి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. రూ. 50 వేల లోపు రైతు రుణ మాఫీపై క్యాబినెట్ సమావేశంలో సీఎం ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగష్టు 15 వ తేదీన సీఎం కేసీఆర్ లాంఛనంగా రూ. 50 వేలలోపు రైతు రుణాల మాఫీ ప్రకటిస్తారు. ఆగష్టు 16 వ తేదీ నుంచే ఆరు లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 2,006 కోట్లు జమ అవుతాయి. బ్యాంకర్లు , ప్రభుత్వ అధికారులు సమన్వయంతో రైతుల ఖాతాల్లో రుణ మాఫీ మొత్తం జమ అయ్యేలా చూడాలి. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని బ్యాంకర్లకు సూచించారు.

రైతుల ఖాతాల్లో రుణ మాఫీ మొత్తం జమ అవగానే ముఖ్యమంత్రి పేరుతో రైతు రుణం మాఫీ అయినట్లు లబ్ధిదారుల ఫోన్లకు సందేశాలు వెళ్లాలన్నారు. రైతు రుణ మాఫీతో పాటు కొత్త పంట రుణానికి మీరు అర్హులని ఆ సందేశంలో తప్పకుండా పేర్కొనాలన్నారు. రైతుల ఖాతాల్లో జమ అయిన రుణ మాఫీ మొత్తాన్ని మరే ఇతర ఖాతా కింద జమ చేయవద్దన్నారు. రైతులకు ఇబ్బందులు సృష్టించవద్దన్నారు. రుణ మాఫీ లబ్ధిదారులైన రైతుల ఖాతాలను జీరో చేసి కొత్త పంట రుణం ఇవ్వాలన్నారు. మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల రుణ మాఫీ చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వానికి అన్ని బ్యాంకులు సహకరించాలన్నారు. బ్యాంకులు ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా రైతులకు రుణ మాఫీ మొత్తం చేరేలా చూడాలన్నారు. వ్యవసాయ శాఖ తరుపున సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఆర్థిక, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ఆయా బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## నడవలేని స్థితిలో ఉన్న యువకుల చికిత్సకు మంత్రి కేటీఆర్ సాయం

హైదరాబాద్ , ఆగష్టు 6: పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి గ్రామానికి చెందిన యువకులు గుంపుల సతీష్, ప్రేమ్‌కుమార్. అంగవైకల్యంతో పూర్తిగా నడవలేని స్థితిలో బాధపడుతున్నారు.

యువకుల దీన పరిస్థితిని రామంగుండం శాసన సభ్యులు కోరుకంటి చందర్ రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. వీరి ఆరోగ్య పరిస్థితిని చూసి చలించిన కేటీఆర్ తక్షణమే చికిత్సకు హామీ ఇచ్చారు. వెనువెంటనే సన్‌షైన్ హాస్పిటల్ గురువారెడ్డితో మాట్లాడి వైద్యం అందించాల్సిందిగా కోరారు. వీరిద్దరి వైద్యానికి అయ్యే ఖర్చు రూ.20 లక్షలను పూర్తిగా ఇస్తానని హామీ ఇచ్చారు. దీనిపై ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్పందిస్తూ.. ప్రజా సేవలో మంత్రి కేటీఆర్ తనకు తానే సాటి అని మరోమారు చాటారని కొనియాడారు. గొప్ప మనస్సుతో స్పందించిన రామన్నకు ధన్యవాదాలన్నారు.

# నేతన్న చేనేతకు పట్టం - 'లోకల్ ఫర్ ఓకల్'కు ఊతం

## (07 ఆగష్టు 'జాతీయ చేనేత దినం' సందర్భంగా)

మానవ కనీస అవసరాలుగా కూడు, గూడు, బట్ట వస్తాయి. అన్నదాత వ్యవసాయం తరువాత అతి పెద్ద పరిశ్రమగా నేతన్న చేనేతకు పేరుంది. ప్రతి వ్యక్తికి పుట్టిన క్షణం నుంచి తుది శ్వాస వరకు వస్త్రధారణ తప్పనిసరి. మనం ధరించే వస్త్రాలే మన మానసిక, ఆర్థిక, సామాజిక స్థాయిని గౌరవాన్ని కట్టబెడతాయి. పంచె కట్టులో పురుషులు, చీర కట్టులో స్త్రీలు హుందాగా, అందంగా, ఆకర్షణీయంగా, సాంప్రదాయం ఉట్టిపడేలా కనిపించడానికి ఏకైక కారణం మనం ధరించే అద్భుత వస్త్రాలే కారణమని మనందరికీ తెలుసు. చేతులో మాయాజాలం, సప్తవర్ణ సింగిడి చీర నేతలో సృజన, దారం పోగును నాట్యం చేయించగల నైపుణ్యం నేతన్న హస్తానికే ప్రత్యేకం. నాడు విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ చేనేత వస్త్రాలను ప్రోత్సహించిన మహాత్మాగాంధీకి ఊపిరిగా నిలిచిన నూలు వడికే రాట్నంతో ప్రారంభమైన చేనేత వస్త్రాల ప్రచారం నేడు ఆధునిక సాంకేతిక యంత్రాల మధ్య నలిగి ప్రాభవాన్ని పోతున్నది. సిరిసిల్ల చేనేత వస్త్రాలు, మంగళగిరి చీరలు, బెనారస్ వస్త్ర వెలుగులు, ధర్మవరం ధగధగలు, కలంకారీ కళాకాంతుల వస్త్ర రంగులు లాంటివి మనల్ని నేటికీ మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి.

భారతదేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న వేళ భరతజాతి 07 ఆగష్టున 'జాతీయ చేనేత దినోత్సవం' పాటించడం శుభపరిణామంగా చెప్పాలి. మన చేనేతలు ప్రపంచానికే ఆదర్శమని, మన దేశానికి గర్వకారణమని ప్రచారం చేయాల్సిన సందర్భమిది. 2015 ఆగష్టు 07న ప్రారంభమైన జాతీయ చేనేత దినం వేదికగా చేనేత వస్త్రాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, ఆరోగ్య సాధనకు చేనేత వస్త్రాలను వాడాలనే ప్రచారం చేయడం జరుగుతుంది. చేనేత వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు 31.45 లక్షలు ఉన్నారని, అదనంగా 4.33 మిలియన్ల ఉద్యోగ ఉపాధులను కల్పిస్తున్నదని నేటి అంచనా. 07 ఆగష్టు 1905న ప్రారంభమైన 'స్వదేశీ ఉద్యమానికి' గుర్తుగా ప్రతి ఏట 07 ఆగష్టున చేనేత దినం పాటించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షదాయకం. జాతీయ చేనేత దినం-2021 నినాదంగా 'హాండ్లూమ్ - ఆన్ ఇండియన్ లెగసీ' అనే అంశాన్ని తీసుకున్నారు.

నేతన్న హస్తకళానైపుణ్యంతో వస్త్రాలపై వెలసే రంగుల సింగిడిలు మన కళ్ళకు విందులను వడ్డిస్తున్నాయి. జాతీయ స్థాయిలో నేషనల్ హండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నేతృత్వంలో 'మై హాండ్లూమ్ మై ప్రైడ్ ఎక్స్‌పో' ప్రదర్శనలను నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలకు విస్తృత ప్రచారం చేయడం, చేనేత బట్టల్ని ధరించేలా ప్రజలకు ప్రేరణ కలిగించడం జరుగుతోంది. ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న 22 రాష్ట్రాలకు చెందిన 125 చేనేత సంస్థలు పాల్గొంటూ తమ ఉత్పత్తులను ప్రచారం చేసుకోవడం, విక్రయించడానికి అవకాశం కల్పించబడుతున్నది. దేశంలో 1246 చేనేత క్లస్టర్లు ఉండగా, ఆంధ్రలో 98 మరియు తెలంగాణలో 34 ఉన్నాయి. ప్రపంచ వస్త్ర ఉత్పత్తుల్లో భారతదేశం 6.9 శాతంగా ఉండగా, చైనా 52.2 శాతం మార్కెట్‌ను కైవసం చేసుకుంటున్నది. ప్రపంచ చేనేత వస్త్ర ఉత్పత్తుల్లో 95 శాతం భారతదేశమే ఉత్పత్తి చేస్తున్నది. మన దేశ సంస్కృతి వారసత్వాలు ఉట్టిపడేలా నేతన్న చూపిస్తున్న హస్తకళానైపుణ్యాలతో చేనేత పరిశ్రమకు ఆదరణ పెరగాలని, నేతన్న కుటుంబం ఆర్థికంగా బలపడాలని మనందరం కోరుకోవాలి. చేనేత పరిశ్రమలో 70 శాతం మహిళలే ఉంటారని, వారిలో ఆత్మవిశ్వాసం పెరిగేలా చేనేత బట్టకు పట్టం కట్టడం అత్యవసరమని గమనించాలి.

చేనేత వస్త్రాల్లో ముఖ్యంగా కాటన్, సిల్క్, ఉన్ని, ఖాదీ, పట్టు వస్త్రాలు వస్తాయి. నేతన్నకు చవకగా నూలు అందుబాటులోకి తేవడం, పరిశ్రమలు నెలకొల్పడానికి ఆర్థిక చేయూతను ఇవ్వడం, వస్త్ర ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యతగా గుర్తించాలి. నేతన్న ఉత్పత్తుల్లో చీరలు, పంచెలు, కాటన్ దుస్తులు, గృహ వస్త్ర ఉత్పత్తులు, బెడ్ షీట్స్, దుప్పట్లు, శాలువాలు, కండువాలు, కార్పెట్లు, డ్రెస్ మెటీరియల్స్, అంగవస్త్రాలు లాంటివి అనేకం వస్తాయి. చేనేత నూలును ఖాదీ వస్త్రంగా, మిల్లులో ఒడికిన నూలును హాండ్లూమ్ ఫాబ్రిక్‌గా వస్త్ర ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయి. ఆత్మనిర్భర్ భారత్ నినాదంలో భాగంగా 'ఓకల్ ఫర్ లోకల్' ప్రచారాన్ని క్షేత్ర స్థాయిలో చేసి చూపించాల్సిన సమయం ఆసన్నమైంది. ఒడిసా ఇక్కత్, ఆంధ్రప్రదేశ్ కలంకారి, గుజరాత్ బంధనీ మరియు పటన్ పటోల, యుపీ బ్రొకేడ్స్ ఉత్పత్తులకు అనాదిగా విశేష ఆదరణ కొనసాగుతున్నది. మన దేశంలో బహుళ ఆదరణ పొందిన హాండ్లూమ్‌లలో కాలికో గిల్డ్, రేవా సొసైటీ, వైశాలి యస్, జిగ్మత్ కోచూర్, హెర్లూమ్ నాగా, రా మాంగో, అబ్రహమ్ తాకోర్, సరితా హండాలు వస్తాయి. మన మూలాలను వెతుక్కుంటూ, సదాచారాలను పాటిస్తూ, చేనేత హస్తకళలను ఆదరిస్తూ, అందమైన హుందాగా కనిపించే చేనేత వస్త్రాలను సగర్వంగా ధరిస్తూ, ఖాదీ త్రివర్ణ పతాకానికి సవినయంగా సలామ్ చేద్దాం. నేతన్న కళ్ళల్లో ఆనంద హరివిల్లులు దర్శిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# పాత నోట్లు, నాణేల విషయంలో జాగ్రత్త: ఆర్‌బీఐ

న్యూఢిల్లీ, ఆగష్టు 6:పాత కరెన్సీ నోట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. పాత నోట్లు, నాణేల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరించింది. పాత నోట్ల క్రయవిక్రయాలపై ఛార్జీలు, కమిషన్ వసూలు చేసే వారి విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వ్యక్తులు లేదా కంపెనీలు పాత నాణేలు, పాత నోట్లను విక్రయించడానికి లేదా కొనుగోలు చేయడానికి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరును ఉపయోగించుకోవచ్చని, అలాంటి ఆఫర్లను నమ్మవద్దని ఆర్‌బీఐ ప్రజలను అలర్ట్ చేసింది.

ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా కొంత మంది పాత నోట్లను కొనుగోలు లేదా అమ్మకం నిర్వహిస్తున్నారని ఆర్‌బీఐ దృష్టికి వెళ్లింది. దీనికి ఆర్‌బీఐ పేరు, లోగోను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. తాము ఏ వ్యక్తికి లేదా సంస్థలకు ఇలాంటి కార్యకలాపాలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఛార్జీలు లేదా కమిషన్ వంటివి వసూలు చేయడం లేదని తెలిపింది. అందువల్ల ప్రజలు ఇలాంటి కార్యకలాపాలతో జాగ్రత్తగా ఉండాలని కోరింది. అందువల్ల ప్రజలు పాత నోట్లు, నాణేల విషయంలో వచ్చే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందే.

# 2024లో స్వర్ణం సాధిస్తా.. దుర్గమ్మ సాక్షిగా సింధు



అమరావతి, ఆగష్టు 5:2024లో జరిగే ఒలింపిక్స్‌లో కచ్చితంగా స్వర్ణం సాధిస్తానని బ్యాడ్మింటన్ స్టార్ పి.వి సింధు ధీమా వ్యక్తం చేశారు.

టోక్యో ఒలింపిక్స్ లో కాంస్య పతకం సాధించిన అనంతరం నిన్న విజయవాడకు వచ్చిన సింధూ.. ఈరోజు ఉదయం ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సింధుకి పూర్ణకుంభంతో ఆలయ అధికారులు స్వాగతం పలికారు. సింధు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ ఈఓ భ్రమరాంబ అందించారు. ఈ సందర్భంగా పీవీ సింధు మీడియాతో మాట్లాడుతూ.. టోర్నమెంట్‌కు వెళ్లేముందు అమ్మవారి దర్శనానికి వచ్చానని చెప్పారు. అమ్మవారి దర్శనానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

# మహిళపై ఆటో డ్రైవర్ దాష్టీకం

హైదరాబాద్ , ఆగష్టు 6:ఇచ్చిన బాకీ అడిగినందుకు మహిళ అనే కనికరం లేకుండ ఓ ఆటో డ్రైవర్ రెచ్చిపోయాడు. కాలితో మహిళను కొట్టాడు. ఈ ఘటన గుంటూరు జిల్లాలో చోటు చేసుకుంది. తాడేపల్లి మహానాడులో కొంతకాలం జీవనం సాగించిన బాధిత మహిళ.. ప్రస్తుతం విజయవాడ రాణి గారి తోటలో నివాసం ఉంటోంది. మహానాడులో ఉండగా తాపీ మేస్త్రిగా పనిచేసే చిర్రావురుకి చెందిన గోపి కృష్ణ అనే యువకుడికి 3 లక్షల నగదు వడ్డీకి ఇప్పించింది. అయితే, అప్పు తీర్చమని అడుగుతున్న పట్టించుకోవడం లేదు. దీంతో చిర్రావూరు వచ్చి తీసుకున్న బాకి తీర్చమని అడిగింది. ఈ క్రమంలో జనసంచారం లేని కృష్ణ కరకట్టపై మహిళపై దాడికి పాల్పడ్డాడు. కాలితో ఎగిరి తన్నటంతో మహిళ కుప్పకూలిపోయింది. ఈ ఘటనపై బాధిత మహిళ పోలీసులకు సమాచారం ఇచ్చింది. ప్రస్తుతం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితురాలు చికిత్స పొందుతోంది.

# కొత్త డిజిటల్ చెల్లింపుల విధానం ఇ-రుపీ గురించి తెలుసుకోండి

న్యూఢిల్లీ, ఆగష్టు 6:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆగష్టు 2వ తేదీన నగదు రహిత, కాంటాక్టు రహిత డిజిటల్ చెల్లింపుల విధానం ఇ-రుపీని ప్రారంభించారు. ఇ-రుపీ వోచర్ ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటి) విధానంలో కీలక పాత్ర పోషిస్తుందని, దేశంలో డిజిటల్ లావాదేవీలను మరింత సమర్థవంతం చేయడంతో పాటు డిజిటల్ పాలనకు కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుందని ఈ సందర్భంగా ప్రధానమంత్రి అన్నారు. ప్రజలను టెక్నాలజీతో అనుసంధానం చేయడంలో భారతదేశం ఏ విధంగా పురోగమిస్తోందో తెలియచేసేందుకు ఇ-రుపీ ఒక చిహ్నంగా నిలుస్తుందని ప్రధానమంత్రి చెప్పారు.

ఇ-రుపీ అంటే ఏమిటి, అదెలా పని చేస్తుంది?

మౌలికంగా ఇ-రుపీ అంటే ఒక డిజిటల్ వోచర్. లబ్ధిదారునికి అది ఒక ఎస్ఎంఎస్ లేదా క్యుఆర్ కోడ్ రూపంలో అందుతుంది. ఇది ప్రీ-పెయిడ్ వోచర్ కావడం వల్ల లబ్ధిదారులైన పురుషులు/ మహిళలు దాన్ని ఆమోదించే ఏ కేంద్రానికైనా వెళ్లి నగదుగా మార్చుకోవచ్చు.

ఉదాహరణకి ప్రభుత్వం ఒక ఉద్యోగికి నిర్దేశిత ఆస్పత్రిలో చికిత్స చేయించి ఖర్చులు భరించాలని నిర్ణయించినట్టయితే భాగస్వామ్య బ్యాంకు ద్వారా నిర్దేశిత మొత్తానికి ఇ-రుపీ జారీ చేయవచ్చు. ఆ ఉద్యోగి తన ఫీచర్ ఫోన్/ స్మార్ట్ ఫోన్ పై ఎస్ఎంఎస్ లేదా క్యుఆర్ కోడ్ రూపంలో దాన్ని అందుకుంటాడు. ఆ రకంగా ఇ-రుపీ ఒక కాంటాక్ట్ రహిత ఏక కాల చెల్లింపుల విధానం. ఎలాంటి కార్డు, డిజిటల్ చెల్లింపుల యాప్ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ అవసరం లేకుండానే వినియోగదారులు నగదు రహిత విధానంలో అందిన ఆ చెల్లింపు మొత్తాన్ని నగదుగా మార్చుకోవచ్చు.

ఇ-రుపీని త్వరలో భారత రిజర్వు బ్యాంకు జారీ చేయనున్న డిజిటల్ కరెన్సీగా మాత్రం భావించకూడదు. ఇ-రుపీ అనేది ప్రత్యేక లక్ష్యం కోసం ఎవరైనా ఒక వ్యక్తి పేరు మీద జారీ చేసే లక్ష్య నిర్దేశిత డిజిటల్ వోచర్.

ఇ-రుపీ ఏ విధంగా వినియోగదారునికి ప్రయోజనకరం?

ఇ-రుపీ అందుకునే వ్యక్తికి బ్యాంకు ఖాతా ఉండాల్సిన అవసరం లేదు. ఇతర డిజిటల్ చెల్లింపు విధానాలతో పోల్చితే ఇ-రుపీ విశిష్ట లక్షణం ఇదే. అది కాంటాక్ట్ రహితంగా రెండంచెల్లో రిడెంప్షన్ (చెల్లింపు) ప్రక్రియ పూర్తి చేసే విధానం. ఇందుకోసం లబ్ధిదారుడు తన వ్యక్తిగత సమాచారం ఎవరికీ తెలియచేయాల్సిన అవసరం లేదు.

బేసిక్ ఫోన్లపై కూడా పని చేయడం ఇ-రుపీ అందించే మరో ప్రయోజనం. అంటే స్మార్ట్ ఫోన్లు లేని వారు, ఇంటర్నెట్ కనెక్షన్ అందుబాటులో లేని ప్రాంతాల్లో కూడా దీన్ని వినియోగించుకోవచ్చు.

ఇ-రుపీ స్పాన్సర్లకు కలిగే ప్రయోజనాలేమిటి?

ప్రత్యక్ష నగదు బదిలీ విధానం (డిబిటి) పటిష్టం చేయడంలో ఇ-రుపీ కీలక పాత్ర పోషిస్తుంది. ఆ ప్రక్రియ మరింత పారదర్శకం చేస్తుంది. ఎలాంటి ఫిజికల్ వోచర్లు జారీ చేయాల్సిన అవసరం లేదు గనుక ఇది వ్యయాన్ని పొదుపు చేసే సాధనంగా కూడా చెప్పవచ్చు.

సర్వీస్ ప్రొవైడర్లకు చేకూరే ప్రయోజనాలేమిటి?

ఇ-రుపీ అనేది ఒక ప్రీ పెయిడ్ వోచర్ కావడం వల్ల సర్వీస్ ప్రొవైడర్లు ఏ క్షణంలో కావాలంటే సంబంధిత చెల్లింపు పూర్తయిపోతుంది.

ఇ-రుపీ అభివృద్ధి చేసింది ఎవరు?

దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను పర్యవేక్షించే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ పిసిఐ) నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు వోచర్ ఆధారిత విధానం ఇ-రుపీని ప్రారంభించింది.

ఆర్థిక సర్వీసుల శాఖ, ఆరోగ్యం ఉ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, జాతీయ ఆరోగ్య సంస్థ సమన్వయంతో దీన్ని అభివృద్ధి చేశారు.

ఏ బ్యాంకులు ఇ-రుపీ జారీ చేస్తాయి?

ఇ-రుపీ లావాదేవీల కోసం ఎన్ పిసిఐ 11 బ్యాంకులతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. అవి యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, హెచ్ డిఎఫ్ సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. భారత్ పే, భీమ్ బరోడా మర్చంట్ పే, పైన్ ల్యాబ్స్, పిఎన్ బి మర్చంట్ పే, యోనో ఎస్ బిఐ మర్చంట్ పే యాప్ లు ఇ-రుపీని స్వీకరిస్తాయి. మరిన్ని బ్యాంకులు, యాప్ లు త్వరలో ఇ-రుపీ విధానంలో భాగస్వాములు కావచ్చు.

ఇ-రుపీని ఇప్పుడు ఎక్కడ వినియోగించవచ్చు?

తొలిదశలో ఎన్ పిసిఐ 1600 పైగా ఆస్పత్రులతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఆ ఆస్పత్రులన్నీ ఇ-రుపీని ఆమోదిస్తాయి. రాబోయే కాలంలో ఇ-రుపీ వినియోగదారుల పరిధి మరింతగా విస్తరిస్తుందని, ఉద్యోగులకు ప్రయోజనాలు అందించేందుకు ప్రైవేటు సంస్థలు కూడా దాన్ని వినియోగించవచ్చునని, ఎంఎస్ఎంఇలు కూడా బిజినెస్ టు బిజినెస్ (బి2బి) లావాదేవీల కోసం దీన్ని ఉపయోగించుకునే అవకాశం ఉన్నదని నిపుణులంటున్నారు.

# గెల్లు శ్రీనివాస్ కే హుజురాబాద్ టీఆర్ఎస్ టికెట్!

హైదరాబాద్ , ఆగష్టు 6:హుజురాబాద్ టీఆర్ఎస్ అభ్యర్థిగా బీసీ వర్గానికి టీఆర్ఎస్వీ(ఖీూం) రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ కు ఖాయం అయినట్లు సమాచారం. సర్వేలు, ఇంటెలిజెన్స్ రిపోర్ట్ తర్వాతే గెల్లు శ్రీనివాస్ పేరును పార్టీ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ కన్ఫామ్ చేసినట్లు తెలుస్తోంది. గెల్లు శ్రీనివాస్ తో పాటు ఇటీవల కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్ లో చేరిన స్వర్గం రవి, జమ్మికుంట స్థానిక నేత వీరేశం, వకుళాభరణం కృష్ణమోహన్ పేర్లు పరిశీలించినా.. గెల్లుకే ఇవ్వాలని సీఎం కేసీఆర్ డిసైడ్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్ నగర్ గ్రామానికి చెందిన గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలంగాణ ఉద్యమంలో కిలక పాత్ర పోషించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో విద్యనభ్యసించిన గెల్లు శ్రీనివాస్.. 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. అప్పట్లో టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బొంతు రామ్మోహన్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బాల్క సుమన్‌తో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయనపై 128 పైగా కేసులు నమోదయ్యాయి. జైలు జీవితం కూడా గడిపారు. మానుకోట సంఘటనలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈటల రాజేందర్ తరచూ బీసీ నాయకుడినని, ఉద్యమకారుడినని ప్రజల్లో నినాదం వినిపిస్తుండటంతో ఆయనకు చెక్ పెట్టాలంటే యాదవ సామాజికవర్గానికి చెందిన గెల్లు శ్రీనివాస్ అయితేనే మంచిదనే అభిప్రాయం సర్వేల ద్వారా తేలినట్లు సమాచారం. దీంతో సీఎం కేసీఆర్ ఆయన పేరునే ఫైనల్ చేసినట్లు టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

మొదట్లో పాడి కౌశిక్‌రెడ్డి టీఆర్ఎస్ తరఫున రేసులో ఉన్నారని ప్రచారం జరిగినా.. ఆయనకు గవర్నర్ కోటలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చేందుకు మంత్రి వర్గం సిఫారుసు చేసింది. దీంతో ఆయన రేస్ నుంచి తప్పుకున్నారు. మాజీ మంత్రి ఈటల బీసీ నినాదంతో వెళ్లడంతో.. సీఎం కేసీఆర్ కూడా బీసీ వర్గం నుంచే అభ్యర్థిని బరిలో దింపాలని నిర్ణయించారు. హుజురాబాద్ ఉపఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ ను ఈసీ ఈ వారంలోనే విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ పార్టీ గెల్లు శ్రీనివాస్ పేరును నేడో, రేపో అధికారికంగా ప్రకటించే ఛాన్స్ ఉంది.

# దుబ్బాక ఓ మంచి ఉద్యమ నేతను కోల్పోయింది


సిద్దిపేట, ఆగష్టు 6: దుబ్బాక ఓ మంచి ఉద్యమ నేతను కోల్పోయిందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాకలోని తెలంగాణ విగ్రహం వద్ద దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోలిపేట చిత్రపటానికి ఎంపీ, సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాత, కుటుంబీకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పోరాడిన సోలిపేట రామలింగారెడ్డి మృతి తీరనిలోటన్నారు.



నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ పేదల సంక్షేమం కోసం పరితపించిన నేత సోలిపేట అని కొనియాడారు. సీఎం కేసీఆర్‌కు నమ్మినబంటుగా సోలిపేట ఉన్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోలిపేట జర్నలిస్టుగా, విప్లవకారుడిగా, ఉద్యమకారుడిగా, నాయకుడిగా ఎన్నో సేవలు అందించారు. సోలిపేట మృతి దుబ్బాక కే కాకుండా తెలంగాణకు తీరని లోటు అన్నారు. ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి సాధ్యమని అక్షరాల నిరూపించారని గుర్తు చేశారు. దుబ్బాకలో టీఆర్ఎస్ పూర్వ వైభవం తిరిగి తీసుకువస్తేనే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని టీఆర్ఎస్ శ్రేణులకు ఆయన సూచించారు.

ఎమ్మెల్యే రామలింగారెడ్డి సతీమణి సుజాత మాట్లాడుతూ.. రామలింగారెడ్డి కుటుంబాని కంటే ఎక్కువ ప్రజా సేవకే సమయాన్ని గడిపే వాడిని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అని కోరారు. కార్యక్రమంలో సోలిపేట సతీష్ రెడ్డి, దుబ్బాక నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు.. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ



అమరావతి, ఆగష్టు 6:పులిచింతల డ్యామ్ గేటు విరిగిపోవడంతో పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీలోకి భారీగా వరద నీరు వస్తోంది. దీంతో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నిండుకుండలా మారింది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ ఇన్ ఫ్లో 4,39,975 గా ఉంది. అటు ఔట్ ఫ్లో 4.28,120 క్యూసెక్కులుగా ఉంది. ఈ నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. వరద నీరు మరింత పెరుగుతుందన్న ఉద్దేశంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

వరదనీరు పెరుగుతున్న కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు చేర్చారు. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రకాశం బ్యారేజీకి ఎగువన, దిగువన ఉన్న ప్రజలను అప్రమత్తం చేశారు. కృష్ణా, గుంటూరు జిల్లా వాసులు అలర్టుగా ఉండాలని అధికారులు సూచించారు. మద్దిగూడెం, చింతమోటు, పెదలంక, పెసర్లంక ఓలేరు, పల్లిపాలెం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అటు జిల్లా కలెక్టర్లు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేయడంతో పాటు కావాల్సిన వాటిని సమకూర్చాలని, ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం.. ఐదుగురు మృతి



సంగారెడ్డి, ఆగష్టు 6:సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పుల్కల్ మండలం చౌటకూర్ వద్ద ఎదురుగా వస్తున్న కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు, ఓ చిన్నారి ఉన్నారు. సంగారెడ్డి నుంచి మెదక్‌కు కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కాగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వ్యవస్థ గాడిన పడే వరకు అవే వడ్డీ రేట్లు..

న్యూఢిల్లీ, ఆగష్టు 6:బ్యాంకు వడ్డీ రేట్లపై ఆర్బీఐ కీలక ప్రకటన చేసింది. కరోనా సెకండ్ వేవ్ ప్రభావం నుంచి ఆర్థిక వ్యవస్థ గాడిన పడే వరకు ప్రస్తుతం ఉన్న రిపో రేటు, రివర్స్ రిపో రేటులను కొనసాగిస్తున్నట్లు ఆర్బీఐ కీలక ప్రకటన చేసింది. మానిటరీ పాలసీ కమిటీ సూచించిందని, అందుకు తగ్గట్టుగా ప్రస్తుతం ఉన్న పరిస్థితినే కొనసాగిస్తున్నట్టు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ప్రకటించారు. దీని ప్రకారం ప్రస్తుతం ఉన్నట్టుగానే రిపో రేటు 4 శాతం, రివర్స్ రిపో రేటు 3.35 శాతంగానే కొనసాగనున్నాయి.

ద్రవ్యోల్బణం 5.7 శాతం పరిధిలో ఉంటుందని ఆర్బీఐ అంచనా వేస్తోంది. ఆర్బీఐ రివర్స్ రెపో రేటును 3.35 శాతం వద్ద ఉంచుతుందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 4 శాతం వద్ద యథాతథంగా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.. జూన్‌లో ద్రవ్య విధాన కమిటీ అంచనాల ప్రకారం ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా అభివృద్ధి చెందాయి.. ఇక, కరోనా సెకండ్ వేవ్ ఎదురుదెబ్బ నుండి కూడా ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోందని తెలిపారు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2021-22లో దేశ రియల్ జిడిపిలో 9.5 శాతం వృద్ధి ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశ జిడిపి 17.2 శాతంగా ఉంటుందని శక్తికాంత దాస్ అన్నారు. ద్రవ్యోల్బణంపై శక్తికాంత దాస్ 2021-2022 ఆర్థిక సంవత్సరంలో సిపిఐ 5.7 శాతంగా ఉండవచ్చని, గత సమావేశంలో దీనిని 5.1 శాతంగా అంచనా వేశారు. రెండవ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.9 శాతం, మూడో త్రైమాసికంలో 5.3, నాల్గవ త్రైమాసికంలో 5.8 శాతం ఉండవచ్చు తెలిపారు. అలాగే 2022-2023 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో సిపిఐ 5.1 శాతంగా ఉండవచ్చని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది

# నైట్ కర్ఫ్యూపై సీఎం కీలక ప్రకటన

బెంగళూర్, ఆగష్టు 6: కరోనా పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో రాత్రి తొమ్మిది గంటల నుంచి తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకూ నైట్ కర్ఫ్యూ అమలవుతుందని కర్నాటక సీఎం బసవరాజ్ బొమ్మై శుక్రవారం ప్రకటించారు. మహారాష్ట్ర, కేరళలో కొవిడ్-19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇరు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల్లో వారాంతపు కర్ఫ్యూ విధిస్తామని చెప్పారు. కొవిడ్ టాస్క్ ఫోర్స్‌తో సమావేశానంతరం తాజా మార్గదర్శకాలను సీఎం విడుదల చేశారు.

విద్యాసంస్థలను దశలవారీగా తెరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని ఆయన తెలిపారు. స్కూళ్లు, కాలేజీలను రోజు విడిచి రోజు తెరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని అధికారులు వెల్లడించారు. మరోవైపు కర్నాటకలో తాజాగా 1785 కరోనా పాజిటివ్ కేసులు నమోదవగా మహమ్మారి బారినపడి 25 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజా మరణాలతో కర్నాటకలో కొవిడ్-19 మృతుల సంఖ్య 36,705కు ఎగబాకింది.

# పెగాసస్‌పై చర్చ జరుగాల్సిందే: రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ, ఆగష్టు 6: ప్రజా సంక్షేమానికి సంబంధించిన కీలక అంశాలపై పార్లమెంటులో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ ( ఖీజీష్ట్రబీశ్రీ ఉజీనిటష్ట్రతి ) ఆరోపించారు. వ్యవసాయ చట్టాలు, ధరల పెంపు, పెగాసస్ తదితర అంశాలపై చర్చకు తాము ఎంత పట్టుబట్టినా ప్రభుత్వం మాత్రం అందుకు ఒప్పుకోవడంలేదని రాహుల్‌గాంధీ విమర్శించారు. వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా తాము ఇవాళ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రైతులతో కలిసి ఆందోళన చేస్తున్నామని ఆయన తెలిపారు.

అదేవిధంగా పెగాసస్ అంశంపై కూడా పార్లమెంటులో చర్చ జరుగాల్సిందేనని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. పెగాసస్ స్పైవేర్ ద్వారా ప్రధాని నరేంద్రమోదీ ప్రతి భారతీయుడి ఫోన్‌లో చొరబడ్డాడని ఆయన విమర్శించారు. కాగా, ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తిప్పికొట్టారు. రైతుల గురించి ప్రభుత్వానికి నిజంగా ఆందోళన ఉంటే.. రైతు సమస్యలపై పార్లమెంట్ ఉభయసభల్లో చర్చకు తాము సిద్ధమని తోమర్ చెప్పారు.

ప్రతిపక్షాలే రైతుల సమస్యలపై చర్చకు సుముఖంగా లేవని ఆయన విమర్శించారు. వాళ్లు కేవలం మీడియాలో కనిపించాలనే తపనతోనే మాటిమాటి వ్యవసాయ చట్టాల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

# యువతకు జయశంకర్ సార్ మార్గం అనుసరణీయం : మంత్రి గంగుల



కరీంనగర్ ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు అహర్నిషలు కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలకు అనుగుణంగా యువత నడవాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని మదీనా చౌరస్తా వద్ద గల జయశంకర్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త, తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అన్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత ఆచార్య జయశంకర్ సార్ అని కొనియాడారు. జయశంకర్ ఆలోచనలు, ఆశయాల కనుగుణంగా అన్ని వర్గాల సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్ .వి. కర్ణన్, శాసనమండలి సభ్యుడు నారదాసు లక్ష్మణరావు, నగర మేయర్ వై. సునీల్ రావు ,మున్సిపల్ కమిషనర్ వల్లూరి క్రాంతి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ప్రభుత్వానికి హైకోర్టులో మరో షాక్

అమరావతి, ఆగష్టు 6:ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో మరో షాక్ తగిలింది. రాష్ట్రంలో గ్రామాలను కార్పొరేషన్, పురపాలక సంఘాల్లో విలీనం చేస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్, చట్టసవరణను సవాల్ చేస్తూ హైకోర్టులో 46 మంది పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన హైకోర్టు.. కార్పొరేషన్‌లు, పురపాలక సంఘాల్లో పలు గ్రామాలను విలీనం చేస్తూ వాటికి ఎన్నికలు నిర్వహించాలని జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్, చట్టసవరణపై మూడు వారాల పాటు స్టే విధించింది.

ఈ సందర్భంగా ఆర్డినెన్స్, చట్ట సవరణపై దాఖలైన అన్ని పిటిషన్‌లను విచారిస్తామని హైకోర్టు తెలిపింది. మూడు వారాల్లో తుది విచారణ పూర్తి చేస్తామని.. అప్పటివరకు ఎన్నికలు నిర్వహించొద్దని ఏపీ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని కూడా ప్రభుత్వానికి సూచించింది. కాగా నగర పాలక సంస్థల్లో గ్రామాలను విలీనం చేయడం వల్ల పన్నులు పెరగడం మినహా ఒరిగేదేమీ లేదని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

# రాజీవ్ ఖేల్ రత్న పేరు మార్చడం దారుణం: రేవంత్ రెడ్డి..

హైదరాబాద్ , ఆగష్టు 6:రాజీవ్ ఖేల్ రత్న అవార్డు పేరు ను మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డుగా కేంద్ర ప్రభుత్వం మార్చినం విషయం తెలిసిందే. అయితే ఖేల్ రత్న పేరు ముందు రాజీవ్ పేరును మార్చడం పట్ల కాంగ్రెస్ నేతలు బీజేపీపై మండిపడుతున్నారు. రాజీవ్ ఖేల్ రత్న అవార్డు ను పేరు మార్చి ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు గా నామకరణం చేయడం దారుణం అని అన్నారు టీపీసీసీ అధ్యక్షులు ఎంపీ రేవంత్ రెడ్డి. ఇది బీజేపీ, మోడీ పాలకుల సంకుచిత బుద్ధికి నిదర్శనం అని తెలిపారు. యువకులను అన్ని రంగాలలో ప్రోత్సహించి దేశంలో క్రీడా అభివృద్ధి కి ఎంతో కృషి చేసిన స్వర్గీయ భారత రత్న రాజీవ్ గాంధీ పేరును ఖేల్ రత్నగా ఉ ండడం సముచితం. కాబట్టి ఇలాంటి చిల్లర రాజకీయాలు మార్చుకొని రాజీవ్ గాంధీ ఖేల్ రత్న అవార్డు కొనసాగించాలి. రాజీవ్ గాంధీ దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# జయశంకర్ సార్‌కు నివాళులు అర్పించిన మంత్రి ఎర్రబెల్లి

మహబూబ్‌నగర్, ఆగష్టు 6: జిల్లాలోని తొర్రూర్ డివిజన్ కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ 87 వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ.. తెలంగాణ ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సార్ సేవలు మరిచిపోలేని వన్నారు. కడవరకు తెలంగాణ కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.రాష్ట్ర సాధన కోసం మొదలైన మలిదశ ఉద్యమంలో ఆయన పాత్ర అజరామరంగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఉద్యమం మొదలు పెట్టిన రోజున జయశంకర్ సార్ మార్గదర్శనం చేసారని ఆయన కొనియాడారు. జయశంకర్ సార్ ఆలోచన విధానం మేరకే ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు.



# ఉద్యమ దిక్సూచి జయశంకర్ సార్ : మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట, ఆగష్టు 6 : మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధనలో దివంగత ఆచార్య జయశంకర్ సార్ ఒక దిక్సూచి అని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పులమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమం మొదలు పెట్టిన రోజున జయశంకర్ సార్ మార్గ దర్శనం చేసారని ఆయన కొనియాడారు.

రాష్ట్ర సాధన కోసం మొదలైన తొలి ఉ ద్యమంలో ఆయన పాత్ర అజరామరంగా నిలుస్తుందని మంత్రి తెలిపారు.

తెలంగాణ ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో ఆయన లేకపోవడం అన్న బాధ వెంటాడుతున్న ఆయన ఆలోచన విధానం మేరకే ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# టీఆర్‌ఎస్‌తోనే దళితుల అభివృద్ధి : మంత్రి అల్లోల

నిర్మల్ , ఆగష్టు 6: టీఆర్‌ఎస్‌తోనే దళితుల అభివృద్ధి సాధ్యమని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకం అమలు చేస్తున్నందుకు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి టీఆర్ఎస్ ఎస్సీ సెల్ నేతలు పాలాభిషేకం చేశారు. డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. దళితుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు.

గతంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని వివరించారు. దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ..ఒక్కో లబ్ధిదాడికి 10 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని చెప్పారు.

డా.బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పాలన అందిస్తున్నారని తెలిపారు. దళిత బంధును ఎన్నికల స్టంట్ అని విమర్శలు చేసిన విపక్ష నేతలు ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు.

# హ్యాట్సాఫ్ మీరాబాయి.. లిఫ్ట్ ఇచ్చిన లారీ డ్రైవర్లకు భోజనం పెట్టి..

న్యూఢిల్లీ, ఆగష్టు 6:పైకి ఎదిగితే సరిపోదు.. అలా ఎదగడానికి తనకు సహకరించిన ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుంటేనే గొప్పోళ్లవుతారు. తాజా టోక్యో ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచిన వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను( ఓతితీజీఎజీతి అష్ట్రజీనిబీ ).. తన గొప్ప మనసు చాటుకుంది. తాను ఈ స్థాయిలో ఉండటానికి పరోక్షంగా కారణమైన లారీ డ్రైవర్లను ఇంటికి పిలిచి భోజనం పెట్టి, వాళ్లకు ఓ షర్ట్, మణిపురి కండువా ఇచ్చి పంపించింది. ఇలా 150 మంది లారీ డ్రైవర్లకు ఆమె తనకు తోచిన సాయం చేసింది. మీరాబాయి చాను కుటుంబ పరిస్థితి తెలుసు కదా. చిన్నప్పటి నుంచీ కష్టమంటే ఏంటో ఆమెకు తెలుసు. అడవిలోకి వెళ్లి కట్టెలు కొట్టి వాటిని తలపై అలవోకగా మోసేస్తూ.. అలా అలా వెయిట్‌లిఫ్టింగ్‌పై మక్కువ పెంచుకుంది. అయితే ఆసక్తి ఉంటే సరిపోదు. అందుకు తగిన ఆర్థిక స్థోమత కూడా ఉండాలి. కానీ మీరాబాయికి లేనిది అదే. కనీసం తన ఊరి నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్రైనింగ్ సెంటర్‌కు రోజూ వెళ్లి వచ్చేందుకు తగిన డబ్బు కూడా లేని దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ఆమె తన ఊరికే చెందిన ఇసుక లారీ డ్రైవర్లను ప్రతి రోజూ లిఫ్ట్ అడిగి ఇంఫాల్‌కు వెళ్లి వచ్చేది.

ఇలా వాళ్లు మీరాబాయికి కొన్నేళ్ల పాటు సాయం చేశారు. తాను ఇప్పుడీ స్థాయికి చేరుకోవడం పరోక్షంగా ఈ లారీ డ్రైవర్లు చేసిన సాయాన్ని కూడా ఆమె గుర్తు పెట్టుకుంది. అందుకే మెడల్ గెలిచి వచ్చిన తర్వాత తనకు సాయం చేసిన 150 మంది ఇసుక లారీ డ్రైవర్లను ఇంటికి పిలిచి భోజనం పెట్టి, తనకు తోచిన బహుమతి ఇచ్చింది. వాళ్లను చూసిన క్షణంలో ఆమె భావోద్వేగానికి గురై కంటతడి పెట్టింది. వీళ్లే గనక తనకు సాయం చేసి ఉండకపోతే వెయిట్‌లిఫ్టర్ కావాలన్న తన కల సాకారం అయి ఉండేదే కాదని ఆమె చెప్పింది.

# రెట్రో ట్యాక్స్ ఉపసంహరణను స్వాగతించిన ఆర్బీఐ గవర్నర్

ముంబై, ఆగష్టు 6: వెనకటి తేదీ నుంచి విధించే పన్ను (రెట్రో ట్యాక్స్) నోటీసులను ఉపసంహరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ శుక్రవారం స్వాగతించారు. ఇది సకాలంలో తీసుకున్న నిర్ణయమని ప్రశంసించారు. కరోనా మహమ్మారితో తలెత్తిన సంక్షోభాన్ని చక్కదిద్దేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని కూడా ఆయన సమర్థించారు.

రెట్రో ట్యాక్స్‌ను తొలగించాలనే డిమాండ్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉ న్న అంశమని ఇది తాను రెవిన్యూ కార్యదర్శిగా, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా వ్యవహరించినప్పటి నుంచి వినిపిస్తున్న వ్యవహారమని శక్తికాంత్ దాస్ పేర్కొన్నారు. ఈ దిశగా తీసుకున్న నిర్ణయం సరైన చర్యని ఆయన స్వాగతించారు. ఇక ద్రవ్య విధాన సమీక్షలో భాగంగా కీలక రేట్లను ఆర్బీఐ మరోసారి యథాతథంగా ఉంచింది. ద్రవ్యోల్బణం పెరుగుతున్నా రికవరీకి ఊతమివ్వడంతో పాటు ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం కోసం వడ్డీరేట్లలో మార్పులకు కేంద్ర బ్యాంక్ మొగ్గుచూపలేదు.

# నూతన విద్యా విధానానికి ఏపీ కేబినెట్ ఆమోదం

అమరావతి, ఆగష్టు 6:ఏపీ కేబినెట్ సమావేశం ముగిసింది. దీంతో కేబినెట్‌లో తీసుకున్న పలు నిర్ణయాలను మంత్రి పేర్ని నాని మీడియాకు వెల్లడించారు. కొత్త విద్యా విధానానికి కేబినెట్ ఆమోదించిందని ఆయన పేర్కొన్నారు. కొత్త విద్యా విధానం వల్ల స్కూళ్ల మూసివేత ఉండదు.. ఏ ఉ పాధ్యాయుడి ఉద్యోగం తీసే ప్రసక్తే ఉ ండదన్నారు. పీపీ-1, పీపీ-2 మొదలుకుని హైస్కూల్ ప్లస్ వరకు పాఠశాలలు ఉ ంటాయని.. హైస్కూల్ ప్లస్ కేటగిరిలో మూడో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యా బోధన ఉంటుందని మంత్రి పేర్ని నేని అన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉ పయోగపడే నిర్ణయాలను కేబినెట్ సమావేశంలో తీసుకున్నామని మంత్రి తెలిపారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వెల్లడించారు. 1-5 తరగతుల విద్యార్థులకు ఒకటి లేదా ఇద్దరు టీచర్లతో విద్యా బోధన జరుగుతోందని.. ప్రస్తుతం అమలవుతోన్న విద్యా విధానంపై సర్వే నిర్వహించామన్నారు. విద్యా ప్రమాణాలు సరిగా లేవనే విషయం సర్వే ద్వారా వెల్లడైందని.. విద్యార్థుల జీవితాలను మనమే నాశనం చేస్తున్నామనే ఫీడ్ బ్యాక్ వచ్చిందని పేర్కొన్నారు. సర్వే ఫలితాలు చూశాక.. విద్యా విధానం మార్చాలనే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. బైలింగ్వల్ టెక్ట్స్ పుస్తకాలు అచ్చు వేసిన మొదటి రాష్ట్రం ఏపీనేనని.. తెలుగు సబ్జెక్ట్ కచ్చితంగా ఉంటుందన్నారు.

# లోయలోకి దూసుకెళ్లిన కారు.. తృటిలో జంప్ చేసిన మహిళ

బీజింగ్, ఆగష్టు 6:: ఒక కారు కొండ అంచు నుంచి లోయలోకి దూసుకెళ్లింది. అందులోని ఒక మహిళ తృటిలో జంప్ చేసింది. కాగా, కారు లోపలే ఉన్న మరో మహిళ కూడా అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడింది. అయితే ఆమె తీవ్రంగా గాయపడింది. ఒళ్లు జలదరింపజేసే ఈ ఘటన చైనాలో జరిగింది. ఒక కుటుంబం జిన్జియాంగ్‌లోని కొండ ప్రాంత అందాలను చూసేందుకు దుకు హైవే పక్కగా కారును నిలిపింది. ఆ కొండ ప్రాంతం ప్రముఖ పర్యాటక కేంద్రం కూడా.కాగా, కారు నుంచి దిగిన ఒక వ్యక్తి డ్రింక్ తాగుతున్నాడు. ఇంతలో ఉన్నట్టుండి కారు కొండ అంచు నుంచి లోయలోకి జారసాగింది. అప్రమత్తమైన ఆ వ్యక్తి కారును నిలిపేందుకు ప్రయత్నిస్తూ వెనుక డోర్ తీశాడు. దీంతో అందులో ఉన్న మహిళ తృటిలో కారు నుంచి బయటకు జంప్ చేసింది. అయితే కారు ముందు సీటులో కూర్చొన్న మరో మహిళ సీటు బెల్ట్ పెట్టుకోవడంతో వెంటనే బయటకు రాలేకపోయింది.

ఇంతలో అందరూ చూస్తుండగా ఆ కారు కొండ అంచు నుంచి లోయలోకి దూసుకెళ్లింది. అదృష్టం బాగుండి కారులో ఉన్న మహిళ ప్రాణాలతో బయటపడింది. అయితే ఆమె నడుంకు గాయమైంది. ఒళు జలదరింపజేసే ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. కాగా, కారు ఉన్నట్టుండి కదలడానికి కారణం ఏమిటన్నది అంతుపట్టలేదు. హ్యాండ్ బ్రేక్ ఫెయిల్ లేదా కేబుల్ కట్ అయి ఉంటుందని కొందరు నెటిజన్లు అనుమానం వ్యక్తం చేశారు.

# మీరాభాయ్ చానుకి మోదీ సహాయం

## రహస్యం బయటపెట్టిన మణిపూర్ సీఎం

న్యూఢిల్లీ, ఆగష్టు 6:టోక్యో ఒలంపిక్స్ లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో రజతం గెలిచిన మీరాబాయి చానుకి ప్రధాని నరేంద్ర మోదీ సహాయం చేశారు. ఆమెకు వైద్యం కోసం ప్రధాని నరేంద్రమోదీ సహాయం చేశారని మణిపూర్ ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ తెలిపారు. ఆమెకు కండరాల ఆపరేషన్ కోసం యూఎస్ వెళ్లడానికి సహకరించారని.. అలా చేయకపోయి ఉంటే.. ఈ రోజు దేశానికి పతకం వచ్చేది కాదని బిరేన్ సింగ్ పేర్కొన్నారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించడానికి మోదీ కృషి చేశారని చెప్పారు. మీరాభాయ్ చానుకి సహాయం చేసినందుకు దన్యావాదాలు సీఎం బిరేన్ సంగ్ తెలిపారు.

టోక్యో ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ గెలిచి భారత్ పతకాల ఖాతా తెరిచారు వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను. వెయిట్ లిఫ్టింగ్‌లో 49 కిలోల విభాగంలో రజత పతకం సాధించి రికార్డు నెలకొల్పింది. స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 115 కేజీలు వెయిట్ ఎత్తి పతకం మీద ఆశలు పెంచింది. మొత్తంమీద 202 కేజీలు ఎత్తిన చాను.. స్వర్ణ పతకం కోసం జరిగిన మూడవ అటెంప్ట్‌లో విఫలమైంది. దాంతో రెండవ స్థానంలో నిలవడంతో రజత పతకం సొంత చేసుకుంది. 21 ఏళ్ల తరువాత భారత్‌కు వెయిట్‌లిఫ్టింగ్‌లో ఒలింపిక్ మెడల్ లభించింది.

# కరీంనగర్ టౌన్ ఏసిపిగా తుల శ్రీనివాసరావు భాధ్యతల స్వీకరణ




కరీంనగర్ ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ టౌన్ డివిజన్ ఏసిపిగా శుక్రవారం నాడు తుల శ్రీనివాసరావు పదవి భాధ్యతలు చేపట్టారు. ఆయన ఇటీవల పదోన్నతిపొంది బదిలీపై వచ్చారు.

కరీంనగర్ టౌన్ డివిజన్ నూతన ఏసిపి తుల శ్రీనివాసరావు 1995లో ఎస్ఐగా పోలీస్‌శాఖలో చేరారు. ఎస్ఐ నుండి సిఐగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. ఎస్ఐగా ఎల్లారెడ్డిపేట, సుల్తానాబాద్, పెద్దపలి, కాటారం, మల్లాపూర్, కరీంనగర్ టూటౌన్, రూరల్, కోరుట్లలో పనిచేశారు. 2010లో సిఐగా పదోన్నతిపొంది ఏసిబి, పెద్దపల్లి, కాటారం, సుల్తానాబాద్, కరీంనగర్ వన్‌టౌన్, కరీంనగర్‌రూరల్‌లో పనిచేశారు. ఇటీవల ఎసిపిగా పదోన్నతి పొంది కరీంనగర్ కమిషనరేట్‌లో అటాచ్‌డ్‌గా కొనసాగారు. ఏసిపిగా పదవి భాధ్యతలు చేపట్టిన అనంతరం కరీంనగర్ టౌన్‌డివిజన్‌లోని అన్నిస్థాయిలకు చెందిన పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన ఏసిపి శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల రక్షణ,భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ముందుకుసాగుతామని చెప్పారు. అన్నివర్గాలకు చెందిన ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తామని, అన్నివర్గాల ప్రజలు తమవంతు సహకారం అందిస్తూ పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన బయోలాజికల్-ఈ సంస్థ ఎండీ

న్యూఢిల్లీ, ఆగష్టు 6: హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ ఈ వ్యాక్సిన్ సంస్థ.. కోవిడ్ కోసం కోర్బ్‌వ్యాక్స్ ( అనీతీఎవలజీలీ) టీకాలను తయారు చేస్తున్నది. ప్రస్తుతం కోర్బ్‌వ్యాక్స్ టీకాల పురోగతి వేగంగా జరుగుతున్నట్లు ఆ కంపెనీ ఎండీ మహిమా ధాట్ల తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమె ఇవాళ కేంద్ర ఆరోగ్యశాక మంత్రి మన్సూక్ మాండవీయను కలిశారు. బయోలాజికల్-ఈ సంస్థ ఎండీ మహిమ ఇవాళ తనను కలిసినట్లు మంత్రి మాండవీయ తన ట్విట్టర్‌లో తెలిపారు. వ్యాక్సిన్ ఉత్పత్తి కోసం బీఈ సంస్థకు పూర్తి సహకారాన్ని అందించనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు.

అమెరికాకు చెందిన బేయర్ కాలేజీ ఆఫ్ మెడిసిన్‌తో కలిసి బీఈ సంస్థ కోర్బ్‌వ్యాక్స్ టీకాలపై ట్రయల్స్ నిర్వహించింది. కోర్బ్‌వ్యాక్స్ ఓ ప్రొటీన్ సబ్‌యూనిట్ వ్యాక్సిన్. ఇది సాధారణంగా వ్యాక్సిన్ల తయారీకి వాడే టెక్నాలజీతో రూపొందిస్తున్నారు. హెపిటైటిస్ బీ, హెచ్‌పీవీ వ్యాక్సిన్లకు ఇదే టెక్నాలజీ వాడుతుంటారు.

జూన్ 3వ తేదీన బయోలాజికల్ ఈ సంస్థతో కేంద్ర ప్రభుత్వం ఓ ఒప్పందం కుదుర్చుకున్నది. ఆ డీల్ ప్రకారం ఈ ఏడాది ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఆ సంస్థ సుమారు 30 కోట్ల వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయనున్నది. ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్ల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన గవిలో మహిమ ధాట్ల సభ్యురాలు.

# సింగిల్ డోస్ వ్యాక్సిన్ వచ్చేస్తోంది.. ప్రభుత్వ అనుమతి కోరిన జాన్సన్ అండ్ జాన్సన్

న్యూఢిల్లీ, ఆగష్టు 6:కరోనా వైరస్ కోసం సింగిల్ డోసు వ్యాక్సిన్ ( ూతినిణశ్రీవ ఆనీబవ అనీలతిట ఎజీఱఇతినివ ) అత్యవసర వినియోగానికి అనుమతి కోరుతూ అమెరికా సంస్థ జాన్సన్ అండ్ జాన్సన్ శుక్రవారం దరఖాస్తు చేసుకుంది. ఈ సంస్థ జాన్సెన్ పేరుతో సింగిల్ డోసు వ్యాక్సిన్ తయారు చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో ఈ సంస్థ ఇండియాలో ప్రయోగాల కోసం దరఖాస్తు చేసుకొని దానిని ఉ పసంహరించుకుంది. ఇప్పటికే పలు దేశాలు అనుమతించిన ప్రముఖ వ్యాక్సిన్లను ట్రయల్స్ అవసరం లేకుండా నేరుగా అత్యవసర వినియోగానికి అనుమతించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.

దీంతో పాత దరఖాస్తును ఉపసంహరించుకున్న జే అండ్ జే సంస్థ.. తాజాగా అత్యవసర వినియోగం కోసం దరఖాస్తు చేసుకుంది. గురువారమే అప్లై చేసుకున్నట్లు ఆ సంస్థ శుక్రవారం వెల్లడించింది. ఇండియా ప్రజలకు తమ సింగిల్ డోసు వ్యాక్సిన్ అందించే దిశగా ఇది చాలా ముఖ్యమైన అడుగు అని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ ఈ. లిమిటెడ్ సంస్థతో జే అండ్ జే చేతులు కలిపింది. ఇప్పటికే అమెరికాకు చెందిన మోడెర్నాకు భారత్ అనుమతించిన విషయం తెలిసిందే.

# మెగాఫుడ్ పార్కుల (ఎంఎఫ్‌పి) ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగష్టు 6:ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ 2008 నుంచి అమలు చేస్తున్న మెగాఫుడ్ పార్క్ పథకం (ఎంఎఫ్‌పిఎస్) ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యంలోని ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన (పిఎంకెఎస్‌వై)లో భాగంగా పని చేస్తోంది. పొలం నుంచి మార్కెట్ వరకు విలువ లంకెను కల్పించేందుకు ఆహార ప్రాసెసింగ్‌కు ఆధునిక మౌలిక సదుపాయాలను అందించడం ఈ పథకం ప్రాథమిక లక్ష్యం.

మంత్రిత్వ శాఖ దేశంలో 38 మెగాఫుడ్ పార్క్‌లకు తుది ఆమోదాన్ని, మూడు మెగా ఫుడ్ పార్క్‌లకు సూత్రప్రాయంగా ఆమోదాన్ని తెలిపింది. ఇందులో 22 మెగా ఫుడ్ ప్రాజెక్టులు కార్యకలాపాలను ప్రారంభించగా, 19 ప్రాజెక్టుల అమలు వివిధ దశల్లో ఉంది.

ఆమోదించిన ప్రతి మెగాఫుడ్ పార్కు ఏర్పాటుకు ప్రాజెక్టు వ్యయం సగటున రూ.110.92 కోట్లుగా ఉంది. ఆమోదిత మెగా ఫుడ్ పార్క్‌లలో మొత్తం వ్యయంలో విదేశీ పెట్టుబడులు 5,54,988.00 యుఎస్ డాలర్లు.

ఈ సమాచారాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ శుక్రవారం రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు.

# జయశంకర్ సార్ స్ఫూర్తితోనే తెలంగాణ : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఆగష్టు 6:ఆచార్య కొత్త పల్లి జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి .శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 87 వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ వద్ద ఉన్నజయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ స్ఫూర్తి, వారి భావ వ్యాప్తితోనే తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గుర్తించి ఎలాంటి రక్తపాతం లేకుండా గాంధేయ మార్గం ద్వారా ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ తెచ్చేందుకు ఆయన తోడ్పాటు అందించారని తెలిపారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన కొనసాగుతుందన్నారు.

గత 7 సంవత్సరాలలో తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. గతంలో కరెంటు, తాగునీటికి కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని, దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానానికి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇంకా ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు.



కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ శివకుమార్, మున్సిపల్ చైర్మన్ కె.సి.నర్సింహులు, తెలంగాణ ఉద్యమ కళా కారుల సంఘం అధ్యక్షులు వెంకటేష్, బాలచందర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు, రామలింగం, ఇతర ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు

సిద్దిపేట,ఆగష్టు 6: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో ఘనంగా జరిగాయి. ఈ మేరకు ముస్తాబాద్ సర్కిల్‌లోని జయశంకర్ విగ్రహానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ సార్ సేవలను మంత్రి హరీష్ రావు కొనియాడారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జయశంకర్ సార్ తన జీవితాంతం కష్టపడ్డారని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. జయశంకర్ ఆశయాల సాధానకు చిత్తశుద్ధితో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సూచనలు, సలహాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయని మంత్రి హరీష్ రావు అన్నారు.



# జయశంకర్ సార్ సేవలను తెలంగాణ సమాజం మరిచిపోదు



నిర్మల్ , ఆగష్టు 6: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన నిరంతర కృషిని తెలంగాణ సమాజం ఎప్పటికీ మరచిపోదని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలవమాల వేసి మంత్రి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉమ్మడి పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను అనేక వేదికల ద్వారా తన గళాన్ని వినిపించారని, తెలంగాణ భావజాల వ్యాప్తికి జయశంకర్ సార్ జీవితాంతం కృషి చేశారని ఆయన సేవలను స్మరించుకున్నారు

. ప్రత్యే తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన ఆయువుపట్టుగా ఉన్నారు. తెలంగాణ ప్రజల హృదయాలలో సార్ ఎప్పటికి నిలిచి ఉంటారని పేర్కొన్నారు.

ఆయన అడుగుజాడల్లో నడుస్తూ..రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసన్తూ?ఆయన ఆశయసాధనకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. జయశంకర్ సార్ పై ఉన్న ఎనలేని గౌరవంతో వ్యవసాయ యూనివర్సిటీకీ ఆయన పేరు పెట్టారని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రబోతు రాజేందర్, తదతరులు పాల్గొన్నారు.

### రిసెప్షన్ అధికారులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో

# మరింత ప్రావీణ్యత పెంపొందించుకోవాలి

### -అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్

కరీంనగర్ ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి): సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో పోలీస్‌స్టేషన్లకు చెందిన రిసెప్షన్ అధికారులు మరింత ప్రావీణ్యత పెంపొందించుకోవాలని అడిషనల్ పోలీస్ కమిషనర్(పరిపాలన)జి చంద్రమోహన్ అన్నారు. పరిష్కరించబడిన ఫిర్యాధుల వివరాలను ఎప్పటికప్పుడూ సిసిటిఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు.

శుక్రవారంనాడు కమిషనరేట్ కేంద్రంలో రిసెప్షన్ అధికారుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లకు వచ్చిన అన్నివర్గాల ప్రజలకు కనీసమర్యాదనిచ్చి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. పరిష్కరించబడిన ఫిర్యాధులకు సంబంధించిన రెండు ధృవీకరణలను జతచేసి సిసిటిఎన్ఎస్‌లో అప్‌చేయాలని సూచించారు. కేసులకు సంబంధించిన వివరాలను అప్‌లోడ్ చేయడం ద్వారా రేటింగ్ పెంపొందుతుందని తెలిపారు. పోలీస్‌స్టేషన్లలోని వివిధ విభాగాల పనితీరుపై సర్వేకొనసాగుతున్నదని తెలిపారు. నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. ఎస్‌హెచ్‌ఓలు అందుబాటులో లేకున్నా ఫిర్యాధులను స్వీకరించాలని చెప్పారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా ఆలకించడం ద్వారా వారిలో పోలీసుల పట్ల మరింతనమ్మకం పెంపొందుతుందని తెలిపారు. మహిళాపోలీసులకు పోలీస్‌స్టేషన్లలో మరిన్ని వసతుల కల్పనకోసం ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేందుకు నిర్ణయం తీసుకున్నారని, అవసరంఉన్న వసతుల వివరాలను సంబంధిత ఎస్‌హెచ్‌లకు వివరించాలని చెప్పారు. సదరు ఎస్‌హెచ్‌ఓలు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధచేసి పంపాలని ఆదేశించారు. పోలీసు కుటుంబాలకు చెందిన సభ్యులందరూ వాక్సిన్ తీసుకోవాలని చెప్పారు. 5ఎస్ కార్యక్రమాన్ని ప్రతివారం నిర్వహించాలని చెప్పారు. శాఖాపరమైన సమస్యలు, సెలవుల కోసం ధరఖాస్తులను హెచ్‌యంఎస్ విధానంద్వారా దృష్టికి తీసుకరావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఇన్స్‌పెక్టర్ విజ్ఞాన్‌రావు, ఐటికోర్‌టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**కమిషనరేట్ వ్యాప్తంగా ప్రొఫేసర్ జయశంకర్ జయంతి వేడుకలు**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌వ్యాప్తంగా శుక్రవారంనాడు తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫేసర్ జయశంకర్ 88వ జయంతి వేడుకలు జరిగాయి. కమిషనరేట్‌లో జరిగిన



కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(పరిపాలన)జి చంద్రమోహన్ జయశంకర్ చిత్రపటానికి పూలవాలవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రోఫేసర్ జయశంకర్ తెలంగాణాకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అన్నివర్గాల ప్రజల్లో చైతన్యాన్ని తీసుకవచ్చారన్నారు. ఆ చైతన్యం ప్రభావం ద్వారానే ఉద్యమం కొనసాగి ప్రత్యేక తెలంగాణ ఏర్పడిందన్నారు.

కమిషనరేట్‌లోని పోలీస్‌స్టేషన్లు, సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(టౌన్ డివిజన్) పి అశోక్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఉమేష్‌కుమార్, ఇన్స్‌పెక్టర్లు విజ్ఞాన్‌రావు, రవి, ఆర్‌ఐలు జానిమియా, శేఖర్, మురళి, రమేష్, మినిస్టీరియల్ విభాగం అధికారులు, సిబ్బంది, వివిధ విభాగాలకు చెందిన అన్నిస్థాయిలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ కీలక నిర్ణయాలు ఇవే..

తిరుపతి,ఆగష్టు 6:తిరుమల తిరుపతి దేవస్థానం స్పెసిఫైడ్ అథారిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. అథారిటీ చైర్మన్ జవహర్‌రెడ్డి అధ్యక్షతన తొలిసారి ఈ సమావేశం జరిగింది. తిరుమల అభివృద్ధి పనుల నిధుల కేటాయింపుపై సమావేశంలో చర్చించారు. తిరుమలను కాలుష్య రహిత క్షేత్రంగా మార్చేందుకు 35 ఎలక్ట్రికల్ వాహనాలను కొనుగోలుకు టీటీడీ నిర్ణయం తీసుకుంది. బర్డ్ చిన్నపిల్లల ఆస్పత్రిలో వైద్య పరికరాల కొనుగోలుకు రూ.2.3 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. నెల్లూరు జిల్లాలో సీతారామస్వామి ఆలయం నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరుకు నిర్ణయం తీసుకుంది. త్రిదండి చినజీయర్ స్వామి సూచనల మేరకు 10 ఆలయాల పునర్నిర్మాణం కోసం రూ.9 కోట్లు వినియోగించాలని నిర్ణయించారు. స్వామివారి ప్రసాదానికి వినియోగించే నెయ్యి తయారీలో భక్తుల భాగస్వామ్యం, నవనీత సేవ పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. 2021-22 ఏడాదికి 12 లక్షల డైరీలు, 8 లక్షల క్యాలండర్లు, 2 లక్షల చిన్న డైరీలు ముద్రించాలని నిర్ణయించింది.

# గోల్డ్ మెడల్‌కు రూ.6 కోట్లు.. సిల్వర్ మెడల్‌కు రూ.4 కోట్లు..!

చండీగఢ్, ఆగష్టు 6:: హర్యానా రాష్ట్రం నుంచి భారత్ తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించి వచ్చే వారిపై ఆ రాష్ట్ర సర్కారు కాసుల వర్షం కురిపించబోతున్నది. పతకాలు సాధించిన వారికేగాక కొద్ది తేడాతో పతకాన్ని చేజార్చుకున్న వారికి కూడా ఈ సారి నగదు ప్రోత్సాహకాలు అందించాలని హర్యానా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టరే ( Manohar Lal Khattar )స్వయంగా మీడియాకు వెల్లడించారు.

ఖట్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించి వచ్చిన వారికి హర్యానా ప్రభుత్వం రూ.6 కోట్లను ప్రోత్సాహకంగా అందించనున్నది. అదేవిధంగా రజత పతకం సాధించిన వారికి రూ.4 కోట్లను, కాంస్య పతకం సాధించిన వారికి రూ.2.5 కోట్లను ప్రభుత్వం ప్రోత్సాహక బహుమానంగా ఇవ్వనుంది. అంతేగాక గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి పతకాన్ని తృటిలో చేజార్చుకుని నాలుగో స్థానంలో నిలిచిన వారికి కూడా రూ.50 లక్షల చొప్పున ఆర్థిక ప్రోత్సాహం అందించనున్నట్టు ఖట్టర్ చెప్పారు.

# ఏపీలో మళ్లీ విజృంభించిన కరోనా.. కొత్తగా ఎన్ని కేసులంటే..

అమరావతి, ఆగష్టు 6:ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు మళ్లీ విజృంభిస్తున్నాయి. రాష్ట్రంలో కొత్తగా 2,209 కరోనా కేసులు నమోదు కాగా.. 22 మంది మరణించారు. గడిచిన 24 గంటల్లో 1,896 బాధితులు కరోనా నుంచి కోలుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో యాక్టివ్ కేసులు 20,593గా నమోదయ్యాయి. రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 19,76,141కు చేరింది. కరోనాతో మొత్తం 13,468 మంది మరణించారు. కరోనాతో కృష్ణాజిల్లాలో ఆరుగురు, గుంటూరు జిల్లాలో నలుగురు మృతి చెందారు. చిత్తూరు జిల్లాలో ముగ్గురు మృతి చెందగా.. అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో ఇద్దరు చొప్పున మరణించారు.

మరోవైపు రాష్ట్రంలో కరోనా కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. కేసులు సంఖ్య ఇలాగే కొనసాగితే.. రాష్ట్రంలో మరోసారి లాక్ డౌన్ విధించే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు కరోనా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వైద్య శాఖ సూచించింది.

# సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన పీవీ సింధు

హైదరాబాద్ , ఆగష్టు 6: టోక్యో ఒలింపియన్ కాంస్య పతక విజేత పీవీ సింధు శుక్రవారం దుర్గమ్మ దర్శనం అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఒలింపిక్స్‌లో సాధించిన పతకాన్ని సీఎంకు సింధు చూపించారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించిన సింధును సీఎం అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సింధును జగన్ సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ప్రభుత్వం తరపున సింధుకు రూ. 30 లక్షల చెక్కును అందించారు.అనంతరం పీవీ సింధు మాట్లాడుతూ..క్రీడాకారుల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతోషదాయకమని చెప్పారు. ఒలింపిక్స్‌కు వెళ్లేముందు పతకంతో తిరిగి రావాలని సీఎం ప్రోత్సహించారని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో మరిన్ని పతకాల సాధనకు అవకాశం కలుగుతుందన్నారు. విశాఖలో తన అకాడమీ నిర్మాణానికి ప్రభుత్వం భూమి కేటాయించిందని, త్వరలోనే ఏర్పాట్లు పూర్తిచేసి క్రీడాకారులకు శిక్షణ ఇస్తానని సింధు చెప్పారు.

# ఉన్నత చదువులకు.. ప్రతిభార్హత పరీక్ష

### -రేకుర్తిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌ఎల్ సి




కరీంనగర్ ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి): విద్యార్థిని, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, అర్హత సాధించిన వారిని నీట్, సివిల్స్, క్లాట్, ఐఐటి వంటి ఉన్నత చదువుల్లో రాణించడానికి మైనార్టీ గురుకుల పాఠశాలలు (టెమ్రిస్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఎంపిసి, బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలకు అర్హత పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. రేకుర్తి మైనార్టీ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కరీంనగర్ మైనార్టీ గురుకులాల ఆర్ ఎల్ సి బి. అంబేద్కర్, ప్రిన్సిపాల్ మోనిక సోనీ తో కలిసి పరిశీలించారు.

పరీక్ష కేంద్రంలో వసతులు, పరీక్ష సరళిని ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. 80 మంది విద్యార్థిని లకు 66 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ మోనిక సోని తెలిపారు. జూనియర్ ఉపన్యాసకులు, వార్డెన్ ఫహిమున్నిసా బేగం, సిబ్బంది ఉన్నారు.

# ఇర్ఫాన్ కు బాసటగా నిలిచిన డాక్టర్ మోహన్

### -మానవత్వానికి ప్రతిరూపం ఆధ్య గోలి ఫౌండేషన్

వేములవాడ, ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి): అధ్య గోలి ఫౌండేషన్ పేరుతో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చెయ్యడంతో పాటు ఆపదలో ఉన్నవారికి అండగానిలుస్తూ.చేయుతనందిస్తూ అందరి మన్ననలు పొందుతున్న వేములవాడ మండలం నూకలమర్రిలో గ్రామానికి చెందిన డాక్టర్ మోహన్ మరోసారి తన సేవా గుణాన్ని చాటుకున్నారు . మరోసారి తన మానవతా దృక్పథంతో తీవ్రఅనారోగ్యంతో వింత నరాల వ్యాది తో బాధపడుతు నరకయాతన అనుభవిస్తున్న కోనరావుపేట మండలం బావుసా యిపేట గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ చికిత్స కోసం అధ్య గోలి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గోలి మోహన్ నేతృత్వంలో శుక్రవారం రోజు బావుసాయిపేట గ్రామానికి సభ్యులు తరలివెళ్లారు .ఈ సందర్బంగా వారు ఇర్ఫాన్ వైద్య చికిత్స కోసం రూ .



20,000 వేల రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు . ఈ సందర్బంగా గోలీ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ షేక్ ఇర్ఫాన్ చికిత్స కోసం దాతలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఇర్ఫాన్ ప్రాణాలు కాపాడి అండగా ఉండాలని వారు కోరారు . విషయం తెలుసుకొని చికిత్స కోసం ఇంత త్వరగా స్పందించిన అధ్య ఫౌండేషన్ వారికి ఇర్ఫాన్ కుటుంబసభ్యులతోపాటు మజీద్ కమిటీ ప్రతినిధులు,గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో గోలి దేవయ్య,వేములవాడ కౌన్సిలర్ గోలి మహేష్ సామాజిక కార్యకర్త నంది సాయికుమార్,ఎంపీటీసీ ఫెరోజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వనభోజనాలు



వేములవాడ, ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఎల్లమ్మ దగ్గర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం వన భోజన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకట స్వామి మాట్లాడుతూ ఈ ఆషాడ మాసం సందర్భంగా ప్రతి ఒక్కరికి మంచి జరగాలని అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఎల్లమ్మ తల్లి దీవెనలు అందరికీ ఉండాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలోఓబీసీ జిల్లా అధ్యక్షులు మోడిగే చంద్రశేఖర్,జిల్లా అధికార ప్రాధినిది నాగుల విష్ణు ప్రసాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ కూరగాయల కొమురయ్య, చిలుకా రమేష్ పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు తోట లహరి,నాగుల రాము గౌడ్, లింగంపల్లి కిరణ్, గే0టల ప్రకాష్, కొలకని రాజు, మరి పెల్లి రాజు, బాల బ్రహ్మం, చంద్రగిరి తిరుపతి, నాగుల మహేష్, దేవేంద్ర, పోతుగంటి వెంకన్న, వనపర్తి శంకర్, తదితరులు ఉన్నారు

# జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సిద్ధాంతకర్త. తెలంగాణ ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ప్రొఫెసర్ జయశంకర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వేములవాడ అర్బన్ ఎంపి బూర వజ్రమ్మ బాబు అన్నారు వేములవాడ అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ బూర వజ్రమ్మ బాబుమాట్లాడుతూ నీళ్లు నియామకాలు. నిధులే లక్ష్యంగా సాగిన మలిదశ ఉద్యమానికి తన మేధస్సుతో దిశ నిర్దేశం చేసినటువంటిచిన మహాజ్ఞాని ప్రొఫెసర్ జయశంకర్ అనికొనియాడారు. ఉద్యమ దళపతి ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో రాష్ట్రం సబ్బండ వర్గాల సంక్షేమవే అభివృద్ధిగా అడుగులు వేస్తుందని అన్నారు. జయశంకర్ కన్న కలలను స్వరాష్ట్రంలో కెసిఆర్ నిజం చేస్తున్నారని కొనియాడారు. జయశంకర్ జీవితం ప్రతి తెలంగాణ పౌరునికి స్ఫూర్తిదాయకమయిన అభివర్ణించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జయశంకర్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్ ఆనంద్, ఎంపీ ఓ శ్రీధర్ సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ మండల్ పరిషత్ ,సిబ్బంది పాల్గొన్నారు

# తమిళనాడులో 23 వరకూ లాక్‌డౌన పొడిగింపు

చెన్నై, ఆగష్టు 6: ఆగస్ట్ 23 వరకూ కరోనా లాక్‌డౌన్‌ను పొడిగించినట్టు తమిళనాడు ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. లాక్‌డౌన్ నియంత్రణలకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సడలింపులు ప్రకటించింది. ఇక సెప్టెంబర్ 1 నుంచి 50 శాతం హాజరుతో తొమ్మిది నుంచి పన్నెండో తరగతి విద్యార్థులకు పాఠశాలలను తిరిగి ఓపెన్ చేసేందుకు తమిళనాడు కసరత్తు సాగిస్తోంది. ఇక తమిళనాడులో గడిచిన 24 గంటల్లో తమిళనాడులో 1997 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి

Printed, Published and owned by VEENADAS,at
Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.